
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 । కనిష్ఠం 21.4



కామారెడ్డి
జిల్లా వార్తలు

సోమవారం 30 సెప్టెంబరు 2024

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కామారెడ్డి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో నిజాంసాగర్‌లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.802 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువకు 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



సన్నాలకు బోనస్ ఇచ్చేనా?

కామారెడ్డి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సన్న రకాలు సాగు చేస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ వానాకాలం నుంచి మార్కెట్‌కు తీసుకువచ్చే సన్నాలకు క్వింటాల్‌కు రూ.500ల బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో కామారెడ్డి జిల్లాలో రైతాంగానికి మేలు జరగనుంది. వరి క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించగా ఈ పథకాన్ని సన్న రకాలకు ఈ సీజన్ నుంచే ఇస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్‌లో రైతులు వేల ఎకరాల్లోనే సన్న రకం వరిని సాగు చేశారు. రైతుల వద్ద బోనస్ చెల్లించి కొనుగోలు చేసే ఈ ధాన్యాన్ని రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యంగా సరఫరా చేయనున్నట్లు సంబంధిత శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

98,627 ఎకరాల్లో సన్నాల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ఈ వానాకాలం సీజన్‌లో 3,15,457 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో 2,16,830 ఎకరాల్లో దొడ్డు రకం వరిని సాగుచేయగా 98,627 ఎకరాల్లో సన్న రకం వరిని రైతులు సాగు చేశారు. ఇప్పటికే బాన్సువాడ డివిజన్ పరిధిలోని నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ, బిచ్కుంద మండలాల్లో వరి పంటలు కోతకు వచ్చాయి. మరో 20 రోజుల్లో వరి కోతలను ప్రారంభించనున్నారు. సన్నాలకు మాత్రం మరో 20 రోజులు ఆలస్యంగా చేతికి రానున్నాయి. గత ఏడాది బహిరంగ మార్కెట్‌లో సన్న రకం ధాన్యానికి మంచి డిమాండ్ వచ్చింది. ఈ సమయంలో వరికి ఎలాంటి తెగుళ్ల సైతం రాకపోవడంతో రైతులకు బాగానే కలిసివస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం బోనస్ రూపంలో రూ.500లు ఇస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

6.90లక్షల మెట్రిక్ టన్నుల్లో దిగుబడులు

ఈ వర్షాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురువడంతో వరి పంటను రైతులు లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,15,457 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం వరికి ఎలాంటి తెగుళ్ల లేకపోవడంతో దిగుబడులు బాగానే వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. 6.90 లక్షల మెట్రిక్ టన్నుల్లో వరి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దొడ్డు రకం వరి 2,16,830 ఎకరాల్లో సాగవ్వగా 4.01 లక్షల మెట్రిక్ టన్నుల్లో, సన్న రకం 98,620 ఎకరాల్లో సాగవ్వగా 2.89 లక్షల మెట్రిక్ టన్నుల్లో దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

రూ.1.44 కోట్లు అదనం

జిల్లా రైతాంగం దొడ్డు రకంతో పాటు సన్న రకం వరిని సాగు చేశారు. దిగుబడులు అధికంగా వచ్చి అమ్మకానికి సమస్య ఉన్నదనే భావనే ప్రధాన కారణం. సన్నాలకు ఎక్కువగా తెగుళ్ల వస్తుండడంతో రైతులు అటువైపు మొగ్గు చూపలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు సన్నాల సాగుకు ఆసక్తి చూపారు. ఈ సీజన్‌లో 98,627 ఎకరాల్లో సన్నాలను సాగు చేశారు. ఎకరాన 20 క్వింటాళ్ల చొప్పున దిగుబడులు వచ్చే అవకాశం ఉందని ఈ లెక్కన 2.89 లక్షల మెట్రిక్ టన్నుల్లో దిగుబడి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో రైతులు తమ అవసరాలకు పోగా కనీసం 2.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ ధాన్యానికి ప్రభుత్వం 500ల బోనస్ ఇస్తే అదనంగా సుమారు రూ.1.44 కోట్ల ఆదాయం అవసరం కానుందని తెలుస్తోంది.

- ఈ సీజన్ నుంచే రూ.500 ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 3.15లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఇందులో 2.16 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం
- 98,627 ఎకరాల్లో సన్న రకం సాగు
- 2.89 లక్షల మెట్రిక్ టన్నుల్లో సన్నాల దిగుబడులు
- రైతులకు రూ.1.44 కోట్లు బోనస్ రూపంలో సమకూరనుంది

కుక్కల బెడద తీరేదెన్నడో?



కామారెడ్డిలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు, (ఇన్‌సెట్‌లో మహిళను గాయపర్చిన కుక్క)

- వృద్ధులు, చిన్నారులను గాయపరుస్తున్న శునకాలు
- ఇటీవల జిల్లా కేంద్రంలో ఆరుగురిపై దాడి.. తీవ్ర గాయాలపాలైన బాధితులు
- రోడ్ల మీద ప్రయాణించాలంటే భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- పూర్తి స్థాయిలో నియంత్రణ చేపట్టని అధికారులు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 29: జిల్లాలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లమీద ప్రయాణించాలంటేనే ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లో కుక్కల సంతతి పెరిగింది. గతంలో ఆయా మున్సిపాలిటీల, గ్రామాల పరిధిలో కుక్కలను బంధించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడం లాంటివి చేసే వారు. ప్రస్తుతం ఆ తరహా చర్యలు కనిపించడం లేదు. కుక్కలను చంపకుండా వాటి సంతతిని పెరగకుండా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని సైతం ఎక్కడ అమలు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని భారత్‌రోడ్డు ప్రాంతంలో కుక్క దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒక్కరు హైదరాబాద్‌లో చికిత్స పొందాల్సి వచ్చింది. గతంలో మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామానికి చెందిన ముస్తాబాద్ రామవ్వ అనే వృద్ధురాలిపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కామారెడ్డి పట్టణంలోనూ ఇద్దరు చిన్నారులపై దాడి చేయడంతో వారు ఆసుపత్రిలో చికిత్స పొందారు. బిచ్కుంద, బీర్కూర్, మద్నూర్ తదితర మండలాల్లో అనేక మందిని కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఇదే తరహాలో జిల్లాలోని ఆయా ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో పదుల సంఖ్యలో బాధితులు చికిత్స తీసుకుంటున్నా వాటి నియంత్రణకు మాత్రం చర్యలు కరువయ్యాయి.

కామారెడ్డి పట్టణంలో మళ్లీ పెరిగిన సంతతి

కామారెడ్డి పట్టణంలో వీధి కుక్కల సంతతి రోజురోజుకూ అధికమవుతోంది. గతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటే మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం మేరకు కుక్కలను పట్టణంలో లేకుండా చేసి వాటిని మరో ప్రాంతానికి తరలించారు. ప్రస్తుతం ఆయా వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువ అవడంతో ప్రజలు రోడ్ల వెంట ప్రయాణించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. పట్టణంలోని ముదాంగల్లి, అయ్యప్పనగర్‌లోని ఆలయం వద్ద, హరిజనవాడ, గొల్లవాడ, శ్రీరాంనగర్, భారత్‌రోడ్డు, జేపీఎన్ రోడ్డు,సుభాష్‌రోడ్డు, ఎన్‌జీవోస్ కాలనీ, అశోక్‌నగర్ లాంటి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్సలు పొందిన సందర్భాలున్నాయి. ఇందులో ఎక్కువగా వృద్ధులు, చిన్నారులే ఉన్నారు. గత రెండు నెలల క్రితం కుక్కలను పట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నా తూతూ మంత్రంగానే వాటిని పట్టారని ఎక్కడా పూర్తిస్థాయిలో వాటిని నియంత్రించే ప్రయత్నం చేయలేదని ప్రజలు పేర్కొంటున్నారు. కుక్కలను చంపవద్దని అధికారులు చెబుతున్నా వాటి సంతానం వృద్ధి చెందకుండా పశువైద్యశాఖ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కుక్కల భయానికి ఇంటి నుంచి చిన్నారులను బయటకు పంపలేక, కర్ర సహాయంతో తప్ప బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు.

వృద్ధులు, చిన్నారులను వెంటాడుతూ గాయపరుస్తున్నవైనం

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతునే ఉంది. ఆరుబయటకు ఆడుకోవడానికి వచ్చిన చిన్నారులను, దుకాణాలకు తినుబండరాల కోసం వెళ్తున్న వారిని వెంటాడి గాయపరుస్తున్నాయి. ఇటీవల భారత్‌రోడ్డులో రోజువారి పనుల నిమిత్తం వెళ్తున్న వారిని, ఇంటి ముందు పనులు చేసుకుంటున్న వారిని కుక్క కరవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాచారెడ్డి మండలంలో ఇంటిముందు కూర్చున్న వృద్ధురాలిపై దాడి చేయడమే కాకుండా శరీరమంతా చిద్రం అయ్యేలా కరిచి గాయపరిచాయి. దీంతో సదరు వృద్ధురాలు చికిత్సపొందు తూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అదేవిధంగా గతంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారులను కిందపడేసి తలపై కరువడంతో తీవ్ర రక్తస్రావమై నిజామాబాద్ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే ప్రాంతంలో మరో చిన్నారిని సైతం ఇదే తరహాలో దాడి చేయడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు దోమకొండ, సదాశివనగర్, గాంధారి, రామారెడ్డి తదితర మండలాల నుంచి వారంలో కనీసం ఇద్దరు చొప్పున కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా పశు సంవర్ధకశాఖ, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో కుక్కల బెడదపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.



మొరం తవ్వకాలతో ప్రమాదకరంగా మారిన ప్రాంతం

కరుగుతున్న గుట్టలు

- ఎల్లారెడ్డిలో గుట్టలను తవ్వి మొరాన్ని తరలిస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ భూమిని కలుపుకోవాలని కొందరి ప్రయత్నాలు
- ప్రతీరోజు వందలాది ట్రాక్టర్ ట్రిప్పుల తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ శాఖ అధికారులు
- రూ.లక్షలు కొల్లగొడుతున్న దళారులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 29: ఎల్లారెడ్డి మండలంలోని పలు ప్రాంతాల్లో గుట్టలు మాయమవుతున్నాయి. అక్రమార్కులు మట్టిపై ఆశతో స్థలం కబ్జా చేయాలన్న ఆలోచనలతో గుట్టలను ఇష్టారీతినా తవ్వేస్తున్నారు. దీంతో గుట్టల అనవాళ్లు కోల్పోతున్నాయి. పేద, మధ్య తరగతి వారి ఇంటి నిర్మాణానికి ఇతర అవసరాలకు ఎక్కడైనా మట్టి తెచ్చుకుంటే ఎన్నో ఇబ్బందులకు గురి చేసే అధికారులు ఈ విషయాన్ని మాత్రం సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గుట్టలను తవ్వి పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా మొరాన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచి తరలిస్తున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. వీరికి అధికారుల అండదండలు రాజకీయ నాయకుల, పలుకుబడి ఉండటం వల్లనే మరో మాఫియా రెచ్చిపోతున్నారు అని పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మాయమవుతున్న గుట్టలు

ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో గండి మాసానిపేట్, దేవునిపల్లి, మీసంపల్లి, రాజులకుంట, ఆజామాబాద్, అన్నాసాగర్, వెల్లుట్లపేట, పట్టణ గ్రామాల పట్టణ పరిధిలోని గుట్టలను, కుంటలను, చెరువులలో సైతం కొంత కాలంగా మొరంను దర్జాగా తవ్వుకుంటే పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా అనుమతులు పొందకుండానే అక్రమంగా తవ్వకాలు చేపడుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని మొత్తం 33 గ్రామాలు ఉండగా చాలా వరకు పల్లెలో అటవీశాఖ భూములు ఉన్నాయి. వీటిలో కొన్ని పలువురు రైతులకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలోనే ఉన్నాయి. ఆ భూముల్లో గుట్టలను తవ్వి స్థలాన్ని కలుపుకోవాలని తవ్వకాలు చేపడుతున్నారు. ఫలితంగా వృక్ష సంపద కనుమరుగవడమే కాకుండా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలుచోట్ల గుట్టలు పూర్తిగా అదృశ్యం

కొందరు అక్రమార్కులు మట్టి కోసం తవ్వకాలు చేపడుతుండటంతో పలు చోట్ల గుట్టలు పూర్తిగా అదృశ్యమయ్యాయి. ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి గుట్టలను తవ్వి చదును చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక నాయకులు ఫిర్యాదు చేస్తే అధికారులు కొంత హడావుడి చేసి తరువాత పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గుట్టల తవ్వకంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.



గండి మాసానిపేట్ ప్రాంతంలో గుట్టలను తవ్వుతున్న దృశ్యం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మొరం తవ్వకాలను ఆపి హద్దులు గుర్తించాలని అధికారులకు వినతి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండి మాసానిపేట్ శివారు ప్రాంతంలో ఉన్న పందిరేని కుచ్చలో పూర్తిగా అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్నాయని, మొరం తవ్వకాలను కబ్జా పరిధి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని శనివారం ఎల్లారెడ్డి ఆర్డీవో తహసీల్దార్‌లకు మహేందర్‌కు గండి మాసానికి చెందిన ప్రజలు సుమారు 20 మందికిపైగా సంతకాలు చేసి వినతిపత్రాన్ని అందజేశారు. మొరం తవ్వకాలతో పెద్ద పెద్ద ప్రమాద గుంతలు ఏర్పడి ఆ ప్రాంతం అంతా ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తారా అని పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మైనింగ్ అధికారులు కూడా తవ్వకాలపై ఉక్కుపాదం మోపడం లేదని నామ మాత్రనికే పరిమితం అవుతున్నారని పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

- మహేందర్, తహసీల్దార్, ఎల్లారెడ్డి

అనుమతి లేకుండా గుట్టలను తవ్వితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ భూమి సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మొరం, మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే తమ దృష్టికి తీసుకురావాలని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సునీల్ కుమార్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 29: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. హసాకొత్తూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది ఏలేటి గంగాధర్ తల్లి గంగవ్వ శనివారవ గుండెపోటుతో మరణించగా ఆదివారం ఆయాన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. చౌట్‌పల్లి లో సత్యనారాయణ కుటుంబా న్ని, నర్సాపూర్‌లో ఆర్ఎంపీ జనార్ధన్ మరణించడంతో ఆయన కుటుంబసభ్యులను, అదేగ్రామానికి చెందిన సుధాకర్ మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, పడిగెల ప్రవీన్ , రేవతి గంగాధర్, వేములు గంగారెడ్డి, లింగారెడ్డి, సంజీవ్ యాదవ్, ఉన్నారు.

ఉచిత కంటి, దంత వైద్య శిబిరం



కోటగిరిలో కంటివైద్య శిబిరం

కోటగిరి, సెప్టెంబరు 29 : మండల కేంద్రంలోని పోచారం కాలనీలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్, రవి యువజన సేన ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య శిబిరంలో 80మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స నిమిత్తం బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. మరో పది మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. పలువురికి దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు ఇర్ఫాన్ అలీ, లయన్స్ క్లబ్ సభ్యులు రవి, హన్మంత్ రావు, సంతోష్, మాజీ సర్పంచ్ స్వరూప, నాయకులు సాయిరెడ్డి, అనంత్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 29: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సార్వజనిక్ దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు తాడుమహేష్ మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జన ఉత్సవాలలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజుల పవన్ కుమార్, శ్యామ్, ఐరేండ్ల రాజు, తదితరులున్నారు.

అమీనాపూర్‌లో కుల నిర్మూలన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి బి.దేవరాం

వేల్పూర్, సెప్టెంబరు 29 : మహాత్మ సావిత్రిబాయిపూలే సమాజమార్పు కోసం కులాలు లేని నవసమాజం, అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.దేవరాం అన్నారు. ఆదివారం వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో మహాత్మజ్యోతిరావుపూలే ఏర్పాటు చేసిన సత్యశోదక్ సమాజ్ నేటికి 152ఏళ్లు కావస్తున్న సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో గ్రామంలో కులనిర్మూలన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సబ్‌డివిజన్ నాయకులు రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి దేవరాం హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి దేవరాం, డివిజన్ నాయకులు రాజేశ్వర్, రాజన్న, అర్వింద్, రామన్నపేట్ అంబేద్కర్ సంఘం గ్రామప్రధాన కార్యదర్శి బాబురావు, అమీనాపూర్ మాజీసర్పంచ్ రాజేశ్వర్, నాయకులు ఈరవేణి గణేష్, సత్యం, అమోష్, రాజుగౌడ్, గంగాధర్, సురాజ్, ఇస్తారి రాజు, జ్యోతి, స్వరూప, పద్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన ఎస్సైలు, సీఐలు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 29: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో నూతన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదివారం ఎస్సైలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఏసీపీ బస్వారెడ్డి అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై వెళ్ళడంతో హైదరాబాద్ సీఐడీ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌రెడ్డి బదిలీపై ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించడంతో రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, భీమ్‌గల్ సీఐ నవీన్, ఆర్మూర్ సీఐ రవికుమార్‌లతో పాటు డివిజన్‌లోని ఎస్సైలు హరిబాబు, నాగనాథ్, రజనీకాంత్, నారాయణ, నరేష్, విక్రంలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

● బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 29: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అసెంబ్లీ కన్వీనర్‌లుగా ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జెస్సుఅనిల్‌కుమార్, బాల్కొండ నియోజకవర్గం నుంచి ఏలేటి మల్లికార్జున్‌లతో పాటు మండల ఇన్‌చార్జీలను నియమించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఎండిక్రైజార్, పొల్కం వేణు, దోండి ప్రకాష్, పులి యుగంధర్, బాశెట్టి రాజ్‌కుమార్, కలిగోట ప్రశాంత్, మీర్యాల్‌కార్ కిరాణ్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో కోటగిరి విద్యార్థుల ప్రతిభ

కోటగిరి, సెప్టెంబరు 29: కోటగిరి మైనార్టీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయి జావెలిన్‌త్రో ఈవెంట్‌లో కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి ప్రథమ స్థానంలో నిలిచారు. నిజామాబాద్ నాగారంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. వచ్చే నెల 7, 8తేదీల్లో వరంగల్ జిల్లా హన్మకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో అతనికి చోటు లభించింది. జూనియర్ విభాగంలో జావెలిన్ త్రోలో ఎండీ.అయాన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. తమ కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్‌తో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

'బాధితులకు అండగా ఉంటాం'

ఏర్గట్ల, సెప్టెంబరు 29: మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కౌడ భూమేశ్వర్ సోదరుడు కౌడ భూమేష్ కిడ్నీ సమస్యతో అనార్యోగంతో పాలుకాగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని పాలెం గ్రామంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఏలేటి ప్రవీన్ పెద్దనాన్న చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అంతేగాక కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిప్పెర నాగన్న భార్య చనిపోవడంతో వారి కుటుంబాన్ని, నవీన్ చనిపోవడంతో వారి కుటుంబాన్ని సునీల్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు బద్దం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోకు పాముకాటు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని మహాలక్ష్మీకాలనీలో ఎస్‌హెచ్‌వో రవికుమార్‌కు పాము కాటు వేసింది. శనివారం రాత్రి విధులు నిర్వహించిన ఎస్‌హెచ్‌వో రవికుమార్ వాకింగ్ చేస్తుండగా పాము కాటు వేయడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

టెన్నికాయిట్ పోటీలకు పడకల్ విద్యార్థి ఎంపిక

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు29: జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న గోసంగి రితిక్ ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. జమ్ముకాశ్మీర్‌లోని గాంధీనగర్‌లో నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రితిక్ పాల్గొంటారని తెలిపారు. ఆర్మూర్‌లో మినీస్టేడియంలో ఈనెల 1తేదీ నుంచి 3వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రితిక్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందున జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రితిక్‌ను రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేట్ సెక్రెటరీ సుందర్ రితిక్‌ను అభినందించారు.

మండల క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా చౌట్‌పల్లి పాఠశాల



విజేతలతో కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 29: ఈ నెల 26 నుండి 28 వరకు కమ్మర్‌పల్లి మినిస్టేడియంలో నిర్వహించిన కమ్మర్‌పల్లి అంతర్ పాఠశాల క్రీడోత్సవాలలో అన్ని ఇవెంట్లలో క్రీడాప్రతిభను కనబర్చి ఒవరాల్ చాంపియన్ షిప్‌ను మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాల దక్కించుకుంది. ఈ క్రీడల్లో మార్చ్‌ఫాస్ట్ మొదలుకొని అన్నివిభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో విజయం సాధించి మొత్తం 10 షీల్డ్‌లను కైవశం చేసుకుని ఒవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కాగా మండలకేంద్రంలోని శ్రీవిద్యాసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలస్థాయి క్రీడల్లో అసమాన క్రీడాప్రతిభను కనబర్థు ప్రత్యర్థిజట్లపై విజయాలు సాధిస్తు అన్ని ఇవెంటల్లలో విజయకేతనాన్ని ఎగురవేశారు. అటోర్నిలో మార్చ్‌ఫాస్ట్ మొదలు మొత్తం 8 షీల్డులు చేజిక్కించుకున్నారు. ఆదివారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి క్రీడాకారులను అభినందించారు.

అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల విజేతలు

కబడ్డి జూనియర్ బాయ్స్ ప్రథమ బషీరాబాద్, ద్వితీయ కోనాసముందర్, తృతీయ శ్రీవిద్యాసాయి. జూనయర్ బాలికల విభగంలో ఫస్ట్ బషీరామాద్, సెక్ఠండ్ ఎస్‌విఎస్, థర్డ్ కేజీబివి. జబ్ జూనియర బాయ్‌స్ ఫస్ట్ బషీరాబాద్, సెక్ఠండ్ చౌట్‌పల్లి, థర్డ్ కోనసముందర్. సబ్‌జూనియర్ బాలికలవిభాగంలో ఫస్ట్ చౌట్‌పల్లి, సెకండ్ హాసాకొత్తూర్, థర్డ్ కోనాసముందర్, ఖోఖో జూనియర్ బాయ్‌స్ ఫస్ట్ ఎస్ఎస్‌వీ, కోనాసముందర్, తర్డ్ విజ్ఞానజ్యోతి. గల్స్‌విభాగం లో ఫస్ట్ జేడ్పీహెచ్ఎస్ కమ్మర్‌పల్లి, సెక్ఠండ్ జేడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లి, థర్డ్ ఎస్‌విఎస్ కమ్మర్‌పల్లి. సబ్ జూనియర్ బాయ్‌స్‌లో ఫస్ట్ చౌట్‌పల్లి, సెకండ్ కోనాసముందర్, థర్డ్ హసాకొత్తూర్. బాలికలవిబాగంలో ఫస్ట్ చౌట్‌పల్లి, సెకండ్ కోనాసముందర్, థర్డ్ హసాకొత్తూర్. ఓవరాల్ చాంపీయన్‌గా జేడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లికి దక్కింది.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే

భీమ్‌గల్, సెప్టెంబరు 29: క్రీడలు ఆత్మవిశ్వాసం, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని కృషి హైస్కూల్ స్టేడియంలో ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ మండల అంతర పాఠశాల క్రీడలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన మార్చ్‌ఫస్ట్ ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులకు ప్రేరణగా తీసుకొని క్రీడల్లో ముందుకెళ్ళాలని, ఇవి మానసికోల్లాసానికి దేహదారుడ్యానికి దోహదం చేస్తాయన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలకు బెంచీలు, కంప్యూటర్‌లు, క్రీడా పరికరాలు అందజేస్తూ క్రీడలను ప్రోత్సహిస్తున్న వ్యాపారవేత్త దయానంద్‌రెడ్డిని, క్రీడలకు అతిథ్యమిస్తున్న కృషి హైస్కూల్ యాజమాన్యాన్ని అభినం దించారు. పాఠశాలల మార్చ్‌ఫస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. మార్చ్‌ఫస్ట్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోం టోలు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎంఈవో స్వామి, పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు ఎడ్ల శేఖర్, టీ ఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు కన్నె సురేందర్, కృషి హైస్కూల్ కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి



సన్మానిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

రెంజల్, సెప్టెంబరు 29: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. రెంజల్, నవీపేట మండలాల ఎంఈవోగా విధులు నిర్వహించిన గణేష్ రావు పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహన్ రెడ్డి గణేష్‌రావును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవోగా గణేష్ రావు ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా సేవలందించారని, ఆయన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆంజనేయులు, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, నర్సింహరె డ్డి, తాహెర్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఊర పండుగ

మోస్రా,సెప్టెంబరు 29: మండలంలోని మోస్రా, తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు ఆనవాయితీగా ఊర పండుగను జరుపుతారు. ఈ సందర్భంగా మోస్రా గ్రామ కమిటీ సభ్యులు, తిమ్మాపూర్ గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో చెడును ప్రళదోలడానికి ఈ గ్రామ దేవతల పండుగను పెద్దలు జరిపే వారు అదే ఆనవాయితీగా జరుపుతున్నాం. ఈ కార్యక్రమంలో మోస్రా, తిమ్మాపూర్ గ్రామాల ఆయా కుల సంఘాల అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండల కేంద్రంలోని నవీపేట, దర్యాపూర్ రెవెన్యూ గ్రామాలలో ఆదివారం ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఊర పండుగ ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం ఉత్సవాలు ముగిశాయి. శనివారం అర్థరాత్రి నుండి ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహలక్ష్మి, పోచమ్మ, మైసమ్మ, ఐదు చేతుల పోచమ్మ, ఊరడమ్మ వంటి గ్రామ దేవతలకు పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పందిరి కింద గ్రామ దేవతలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం గ్రామ దేవతలకు మేకపోతులు, గొర్రెలను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని రెంజల్, బోర్గాం, దూప్యాల్లి గ్రామాలలో ఆదివారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. గ్రామాల్లోని గ్రామ దేవతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో డప్పువాయిద్యాల మధ్య గ్రామ దేవతల వద్దకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. ప్రతి యేటా గ్రామంలో బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందని, గ్రామంల్యోని పాడిపంట చల్లగా ఉండాలని బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరెడ్డి, సంతోష్, లక్ష్మణ్, గొజ్జ రమేష్, ఒడ్డెన్న, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్ తగిలి కౌలు రైతుమృతి



మృతి చెందిన కౌలు రైతు పోశెట్టి

ఎడపల్లి, సెప్టెంబర్ 29 : మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో విద్యుత్ షాక్ తగిలి కౌలురైతు మృతి చెందిన సంఘటన జరిగింది. రామన్నగారి సాయికుమార్ పొలాన్ని కుంటి పోశెట్టి అనే కౌలు రైతు కౌలుకు తీసుకుని వ్యసాయం చేస్తున్నాడు. పందుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చగా, ఆదివారం పంటపొలానికి వెళ్లిన పోశెట్టికి కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

కుస్తీపోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ


రుద్రూరు, సెప్టెంబరు 29 : రుద్రూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు కుస్తీ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సొంతం చేసుకుని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28న మంచిప్పలో జరిగిన పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ఎస్.విజయశ్రీ, జి.సువేణిలు జిల్లాస్థాయిలో గోల్డ్‌మెడల్ సొంతం చేసుకున్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ ప్రదర్శిస్తున్న ఎస్.విజయశ్రీని, జి. సువేణిలను ఇంచార్జి ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాస్, పాఠ శాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. కాగా అదే పాఠశాలలో సీఆర్‌పీగా విదులు నిర్వహిస్తున్న విద్యార్థిని విజయశ్రీ తండ్రి అంబ రేసింగ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంఈవో కట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ మా పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికకావడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా సభ్యత్వ నమోదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు29: జిల్లాలో లక్ష్యానికి మించి బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి అన్నారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయించడంలో చురుకుగా పని చేయాలని, ప్రతీ బూత్ అధ్యక్షుడు మండల ముఖ్య నాయకులు దిశ నిర్దేశం చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యల విషయమై బీజేపీ నాయకులు కన్నెపల్లి ప్రసాద్ ప్రస్తావించగా వాటి పరిష్కారానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి తీసుకువెళ్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు కిషన్‌నాయక్, మోహన్‌నాయక్, సంజీవ్‌గౌడ్, కన్నెపల్లి ప్రసాద్, జీవన్, అమర్, కార్తిక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్



కోటగిరిలో మాట్లాడుతున్న విండో అధ్యక్షులు

కోటగిరి,సెప్టెంబరు 29: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్న ధాన్యానికి ప్రతి క్వింటాకు 500రూపాయల బోనస్ ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కోటగిరి మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం 81వ మహజన సభ విండో అధ్యక్షులు కూచి సిద్దు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడాదిలో జరిగిన లావాదేవీలు, జమ, ఖర్చులు, వ్యాపార లాభనష్టాలను వివరించారు. 2023-24 ఆడిట్ రిపోర్ట్‌ను ఆమోదించారు. సంఘం కార్యాలయం చుట్టు ప్రహరి నిర్మాణంతో పాటు పాత కార్యాలయాన్ని మరమ్మత్తు చేసేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా విండో అధ్యక్షులు సిద్దు మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు గజేందర్, డైరెక్టర్‌లు సాయిరెడ్డి, లక్ష్మి, నాయకులు బీర్కూర్ గంగాధర్, మల్లికార్జున్, మోహన్ రావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

బోధన్‌రూరల్ : రైతుల పంట పొలాల కొనుగోలుపై ప్రభుత్వం 500రూపాయల బోనస్ అందించాలని రైతు మహజన సభలో తీర్మానించారు. ఆదివారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో మహజన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహజన సభలో రైతులు పలు తీర్మానాలను చేశారు. ఈ సందర్భంగా మహజన సభలో రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పంట కొనుగోలులో రైతులు గిట్టుబాటు ధర కోసం 500 రూపాయల బోనస్‌ను అందించాలన్నారు. రెండు లక్షల రుణమాఫీ కాని రైతులకు ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని చేయాలన్నారు. రైతుబంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. మహజన సభలో పలు అంశాలను రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో హున్స సొసైటీ చైర్మన్ మందర్నా రవి, ఉపాధ్యక్షులు క్యూల కర్ణి వినోద్ రావు, పాలకవర్గ సభ్యులు సంజీవ్ కుమార్, రమేష్, సిద్దార్థ్, ఖాజాపూర్ అశోక్, మైసయ్య, సీఈవో ముద్ద ఈర్వంత్ రావులతో హన్స, మందర్నా, ఖాజాపూర్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఎన్నికల ప్రణాళికలో ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు రైతుల సన్న, దొడ్డు ధాన్యానికి 500రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని, తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని (ఏఐపీకేఎస్) అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆదివారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ముందు చూపుతో ప్రభుత్వం నిర్ణయాన్ని హర్షిస్తున్నామన్నారు. 60లక్షల 39వేల ఎకరాలలో వరిసాగు చేయబడిందని దొడ్డు ధాన్యం, సన్న ధాన్యానికి ప్రభుత్వం 500రూపాయల బోనస్ చెల్లించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా దొడ్డు, సన్న ధాన్యాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. వర్షంలో తడిసిన పత్తి, ధాన్యం ఎలాంటి కొరివి లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నూతన కార్యవర్గం

ఏర్గట్ల, సెప్టెంబరు 29: మండల కేంద్రంలో ఆదివారం విశ్వబ్రహ్మణ యువజన నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా రాజారపు నర్సయ్య, క్యాషియర్‌గా పరికిపండ్ల నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యువజన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్గట్ల పాఠశాలకు బాల చెలిమి గ్రంథాలయం



ప్రవీణ్‌శర్మకు పుస్తకాలు అందజేస్తున్న రియాజ్, వేదకుమార్

ఏర్గట్ల, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ అలాగే బాల చెలిమి ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్‌శర్మ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నుకోబడిన పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటులో భాగంగా ఏర్గట్ల పాఠశాలకు సుమారు 30 వేల నుండి 40 వేల నగదు విలువైన పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు కానుందని, అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అప్పటికప్పుడు కొన్ని పుస్తకాలను రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ, బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు మణికొండ వేదకుమార్‌లు అందజేసినట్లు ప్రవీణ్ శర్మ తెలిపారు.

రెంజర్లలో మహాజన సభ



లావాదేవిలను చదివి వినిపిసవ్తున్న కార్యదర్శి గంగాధర్

ముప్కాల్, సెప్టెంబరు 29: మండల రెంజర్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన ఆదివారం మహజన సభ నిర్వహించారు. సభలో సొసైటీ కార్యదర్శి గంగాధర్ సొసైటీ లావాదేవీలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సొసైటీలో సరిపడ ఎరువులను సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ ముస్కుసంతోష్, డైరెక్టర్‌లు మేడిపల్లి ముత్తెన్న, సామ రాజేందర్, రాజన్న, క్యాతం గంగారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత రక్తపరీక్ష శిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు 29: ముప్కాల్ మండల కేంద్రంలో ఉచిత రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని ఎస్సై రజనీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు శిబిరంలో రక్త పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు గంగాధర్, గోపిరాం, జక్కుల ప్రవీన్‌కుమార్, గోపినాథ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై పర్యాటకుల సందడి



ప్రాజెక్టుపై పర్యాటకుల రద్దీ

మెండోర, సెప్టెంబరు 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించడానికి పర్యాటకులు ఆదివారం బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిండుకుండలా నిండి జలకళను సంతరించుకోవడంతో ప్రాజెక్టు వరదగేట్లను ఎత్తడంతో ప్రాజెక్టు సుందర దృశ్యాలను చూడడానికి సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు వరద గేట్ల నీటి విడుదల దృశ్యాలను పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లలో సెల్ఫీలు దిగుతూ బందించారు. తమ కుటుంబసభ్యులతో వచ్చి ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ప్రాజెక్టుపై పర్యాటకులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై నారాయణ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు



చెత్తచెదారాన్ని తొలగిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఒకటో లైన్‌లో రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, రోడ్డుపై ఉన్న చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, ఎల్‌టి.కుమార్, ఎర్ర భూమయ్య, గడ్డం శంకర్, సాయన్న, రవి, జీవన్, గోపి, పతంజలి జయారజ్, రాజు, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'కులరహిత సమాజం కోసం పోరాడుతాం'

మాక్లూర్, సెప్టెంబరు29: భారతదేశంలో కుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించినప్పుడు దేశం పురోగతి చెందుతుందని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. ఆదివారం మండలంలోని బోర్గం(కె) గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే సత్యశోదక్ సమాజ్ సంస్థను స్థాపించిన తర్వాత అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు నివాళులు అర్పించి కార్యక్రమం నిర్వహించారు. మాహాత్మజ్యోతిబాపూలే 152ఏళ్ళ క్రితం సత్యశోదక్ సమాజ్ స్థాపించి దేశంలో కుల నిర్మూలనకై అనేక కార్యక్రమాలు స్థాపించారు. బ్రహ్మదీయ బావజలం మనదేశంలో రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడంలేదని, కులంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు పరువుల పేర హత్యలు చేస్తున్నారాన్నరు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కుల నిర్మూలనకై పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు కృష్ణగౌడ్, నిజామాబాద్ డివిజన్ ప్రధానకార్యదర్శి జైశెట్టి రాధ, నాయకులు రాజు, స్నేహిత, గంగాధర్, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

విత్తనశుద్ధితోనే తెగుళ్ల నివారణ

సదాశివనగర్, సెప్టెంబరు 29: రైతులు పంటలు వేసే ముందు విత్తన శుద్ధి తప్పకుండా చేయాలని తద్వారా పంటలపై తెగుళ్ల చీడ పీడలు నివారణ జరుగుతుందని రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు అడ్లూర్ ఎల్లారెడ్డి రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ సమాచారం ప్రకారం ఏ పంట ఏసమయంలో వేయాలో రైతులకు వివరించారు. పంటలపై వ్యాపిస్తున్న తెగుళ్లు, వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, మండల మాజీ కోఆప్షన్ ఇర్షాద్, విండో డైరెక్టర్ భాస్కర్,జగన్‌రెడ్డి, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 29: కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌రెడ్డిలకు ఇప్పటికే వినతిపత్రం అందించామని తెలిపారు. వృత్తిలో ప్రమాదం వలన వందలాది మంది గీతకార్మికులు చెట్టుపై నుంచి పడి చనిపోవడం, వికలాంగులు కావడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే 520 మంది ప్రమాదానికి గురయ్యారని గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. ఈ ప్రభుత్వం జాప్యం చేస్తుందని తక్షణమే గీత కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

కవులు, రచయితలు

సమాజ ఐక్యం కోసం కృషి చేయాలి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 29: కవులు,రచయితలు సమరసతా సాహిత్యం సృష్టించి సమాజ ఐక్యమత్యం కోసం కృషి చేయాలని సామాజిక సమరసతా వేదిక కళా విభాగం రాష్ట్రకన్వీనర్ బండిరాజుల శంకర్ అన్నారు. ఆదివారం సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో సమరసతా మూర్తులు దున్న ఇద్దాసు, గుర్రంజాషువా, బోయిబోమన్న, చిలకమర్తి లక్ష్మీనరసింహ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మంలో అంటరానితనానికి తావులేదని రాముని జీవితాన్ని వివరించారు. కవులు సమాజాన్ని కలిపేవారని, సమాజహితం కోరే సాహిత్యాన్ని రాయాలని సూచించారు. ఆది శంకరులు, రామానుజులు, వివేకానందుల వంటివారు మానవాళి హితం కోరే పద్దతులను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతావేదిక జిల్లా అధ్యక్షుడు అమృత రాజేందర్, జిల్లా ప్రధానకార్యదర్శి భూపల్ యాదాద్రి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు రంగయ్య, కిరణ్, సంగన్న, బాలరాజుగౌడ్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు

జిల్లాస్థాయిలో మొదటి బహుమతి



జిల్లాస్థాయిలో బహుమతి పొందిన విద్యార్థులు

మద్నూర్, సెప్టెంబరు 29: మండల కేంద్రానికి చెందిన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఖోఖో పోటీలలో జిల్లాస్థాయి మొదటి బహుమతి సాధించారు. ఇటీవల అంతర్ మండలాల క్రీడా పోటీలలో మద్నూర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల్లో మొదటి బహుమతి సాధించి జిల్లాస్థాయి ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడా పోటీల్లో అండర్-17 విభాగంలో ఖోఖో పోటీల్లో మొదటి బహుమతి సాధించడంతో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్ విద్యార్థులకు అభినందించారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పీఈటీ గణేష్, అధ్యాపకులు సుమన్, గోవింద్, దత్తాత్రేయ, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు తడిసిన సోయా పంట

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 29: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో ఆది వారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి సోయా పంట వర్షంలో తడిసి పోయింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కింద మండలంలోని ఆయా గ్రామాలలో రైతులు చేతికి వచ్చిన సోయా పంటను కోత పూర్తి చేసి విత్తులను తీసుకువచ్చి ఎండబెట్టారు. సాయంత్రం సమయంలో అకాల వర్షం కురిసి రహదారిపై ఎండ బెట్టిన సోయా పంట నీళ్లలో తడిసి పోయింది. ఆరుగాలం శ్రమించి చేతికి వచ్చిన పంట నీళ్లలో నానిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



అకాల వర్షానికి తడిసిన సోయా పంట

జాతీయ రహదారిపై ప్రయాణం భద్రమేనా..?!



రహదారిపై మేత మేస్తున్న పశువులు

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 29: జాతీయ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రయాణికులు తాము సాఫీగా వాహనాలపై వెళ్దామని అనుకుంటారు. ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకుండా రయ్యు రయ్యుమని దూసుకెళ్తుంటారు. ఇటువంటి రహదారిపై 161వ జాతీయ రహదారిపై ప్రయాణం భద్రమేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి. నిజాంసాగర్ మండలం నుంచి మద్నూర్ మండలం వరకు సుమారు 70 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండగా అను నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రహదారి పైకి అకస్మాత్తుగా వాహనాలు రాకుండా ఉండేందుకు అధికారులు రహదారికి ఇరు వైపులా కంచెను కూడా ఏర్పాటు చేశారు. అయితే కంచెలేని ప్రాంతంలో గ్రామానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలలో ఈ రహదారిపైకి పశువులు, మేకలు, గొర్రెలు వస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం ఉదయం పిట్లం నుంచి జుక్కల్ వైపు ఓ ప్రయాణికుడు మోటార్ సైకిల్ పై ప్రయాణం చేస్తుండగా, బేగంపూర్ శివారులో గొర్రెలు అడ్డుగా రావడంతో మోటార్ సైకిలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. రహదారిపైకి పశువులు, ఇతర జీవ రాశులు రాకుండ హైవే సిబ్బంది చర్యలు తీసుకుంటున్న ఫలితం లేకుండా పోయింది. రహదారిపైకి పశువులతో పాటు ఇతర జంతువులు రాకుండా ఉండేలా హైవే సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 29 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం 2005-06 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఒక్క చోట కలుసుకుని చిన్న నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెహ్రూ, రాఘవేందర్ చారి, మోహన్‌రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న డీఎంపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ సభ్యులు జగన్నాథం, వీఎల్ నర్సింహరెడ్డి

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 29: కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న కామారెడ్డి డీఎం ఇందిరపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జేఏసీ సభ్యులు, న్యాయవాదులు జగన్నాథం, వీఎల్ నర్సింహరెడ్డి, సిద్దిరాములు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మాతో పాటు ముందుండి పోరాడిన ఆర్టీసీ కార్మికులు డీఎంతో పాటు అసిస్టెంట్ డీఎంలు చేస్తున్న వేధింపులపై తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మీస్కీం అమలుపరచడానికి 10 నెలలుగా సహనం,ఓపికతో పనిచేస్తు అటు ప్రభుత్వానికి, ఇటు ఆర్టీసీ యాజమాన్యానికి దేశంలోనే కీర్తిప్రతిష్టలు తెచ్చిపెడుతున్న కార్మికుల పట్ల ఈ విధమైన వేధింపులకు గురిచేయడం తగదన్నారు. కార్మికులను కించపరిచే విధంగా దూషించడం, కార్మికులనుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్మికులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని అంశాలను క్రోడికరించి ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర రవాణాశాఖమంత్రికిఫిర్యాదుచేశామని తెలిపారు. కార్మికులు లేవనెత్తిన అంశాలపై విజిలెన్స్ విభాగం ద్వారా సమగ్ర విచారణచేసి అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. విచారణలో కార్మికులు అన్ని విషయాలు బయట పెడతారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన పీఆర్సీ, ఆర్థిక బకాయిలు అన్ని చెల్లించి వారి కళ్లలో కాంతులు నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు సైతం సమగ్ర విచారణ జరిపితే కార్మికుల కష్టాలు అన్ని బట్టబయలు అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు ఆలే భాస్కర్



మద్నూర్‌లో రైతులతో సభ్యత్వం నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

మద్నూర్, సెప్టెంబరు 29: బీజేపీలో సభ్యత్వ నమోదు చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఓబీసీ నాయకులు ఆలే భాస్కర్ సూచించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో మొగ గ్రామంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకుతో కలిసి రైతుల పంట కల్లాల వద్దకు వెళ్లి వారి చేత సభ్యత్వాన్ని నమోదు చేయించారు. అనంతరం ఆయన నాయకులతో, కార్యకర్తలతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తితో ఉన్న వారి నాయకత్వాన్ని ప్రోత్సహించి పార్టీ సభ్యత్వాలు సాధించాలని సూచించారు. రైతు సమస్యలపై ప్రజా పోరాటాలు చేస్తూనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించాలని అన్నారు. రాబోయే ఎన్నికల నాటికి తెలంగాణలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే కుమారి అరుణ తార, నాయకులు చంద్రశేఖర్, అరుణ్ పటేల్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తా

- ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత

లింగంపేట, సెప్టెంబర్ 29: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పరిధిలోని రైతుల సమస్యలు పరిష్కరించి వారికి అందుబాటులో ఉంటానని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత అన్నారు. ఆమె ఆదివారం లింగంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డైరెక్టర్లు గ్రామాలలోని రైతులకు అందుబాటులో ఉంటు రైతుల రుణమాఫీతో పాటు, గిట్టుబాటు ధర, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఆమె సూచించారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఆమె తెలియజేశారు. కాంగ్రెస్‌పార్టీ రైతు సంక్షేమ ప్రభుత్వమని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జొన్నల రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, ప్రసాద్ గౌడ్, ఫతియొద్దీన్, రఫీఖ్, అట్టెం శ్రీను, ఎల్లమయ్య, అశోక్, భీంరావు, హరి, సత్యం, గోవింద్‌నాయక్‌లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

కాలభైరవ స్వామి

ఆలయ దుకాణాల టెండర్

రామారెడ్డి, సెప్టెంబరు 29: శ్రీకాల భైరవస్వామి ఆలయ ఆవరణలోని కిరాణం, టెంకాయలు, పూజా సామాగ్రి, ప్రసాదాలు, స్వామివారి లడ్డు, పులిహోర సప్లయ్ దుకాణాలకు టెండర్ నిర్వహించనున్నట్లు ఈవో ప్రభురాంచంద్రం గుప్తా తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలు ఒక్కో దుకాణానికి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఈ వేలం నవంబరు 1, 2024 నుంచి అక్టోబరు 1, 2026 వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు టెండర్ ప్రక్రియలో పాల్గొనాలని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



నేలపైన పడి ఉన్న విద్యుత్ వైర్లు

సదాశివనగర్, సెప్టెంబరు 29: సదాశివనగర్ నుంచి రెన్యూపవర్ సోలార్‌కు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం నేల కొరిగి వైర్లు ప్రమాదకరంగా ఏర్పడడంతో రైతులు భయాందోళన చెం దుతున్నారు. లైన్ చెడి పోయిందని పక్క నుంచి వేరే లైన్ ఏర్పాటు చేసి దానితో విద్యుత్ సరాఫరా కొనసాగిస్తున్న విద్యుత్ అధికారులు పడిపోయిన విద్యుత్ లైన్‌వైర్లను తొలగించక పోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆ ప్రాంతానికి వెళ్లే రైతులు, వాహనదారులు వాపోతున్నారు. కింద పడిపోయిన స్తంభం లైన్‌కు విద్యుత్ సరాఫరా నిలిపివేసినప్పటికి ప్రస్తుతం కొనసాగుతున్న 11 కేవీ విద్యుత్ సరాఫరా అవుతున్న దానికి కేవలం మీటర్ ఎత్తులోనే పడిపోయిన లైన్ ఉంది. గాలివాన, ఏదైనా అనుకోకుండా సరాఫరా అవుతున్న వైర్లపైన పడి కింది వైర్‌కు తగిలితే ఎంతటి ప్రమాదం పొంచి ఉంటుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతు లు కోరుతున్నారు.

గొర్రెలు అడ్డు రావడంతో

మోటార్ సైకిలిస్టుకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన దోండిబె

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 29: మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులో 161వ జాతీయ రహదారిపై గొర్రెలు అడ్డురావడంతో ఓ మోటార్ సైకిలిస్టు గాయపడిన ఘటన ఒకటి ఆదివారం చోటు చేసుకుంది. జుక్కల్ మండలం కథల్వాడీ గ్రామానికి చెందిన దోండిబె ఎల్వా హైదరాబాద్ నుంచి కథల్వాడీ గ్రామానికి వెళ్తుండగా బేగంపూర్ గ్రామ శివారులో రహదారిపైకి గొర్రెలు అడ్డురావ డంతో మోటార్ సైకిల్‌పై నుంచి పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది దొండిబెను ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే అతని పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

మద్నూర్‌లో బాలాజీ జెండా ఊరేగింపు



బాలాజీ జెండా ఊరేగింపులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మద్నూర్, సెప్టెంబరు 29: మండల కేంద్రంలో గత 11 రోజులుగా పూజలు అందుకుంటున్న బాలాజీ జెండాకు ఆదివారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం జెండా తిరిగి వెళ్లనున్న దృష్ట్యా ఇంటింటికీ వెళ్లి నిర్వాహకులు పూజలు అందుకునే విధంగా ఏర్పాటు చేశారు. బాలాజీ జెండా ఊరేగింపులో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి మండల కేంద్రానికి చేరుకున్న బాలాజీ జెండా తిరిగి సాయంత్రం మండలంలోని అవల్గావ్, కొడిచిర గ్రామాల గుండా తిరుపతికి తీసుకెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొడిచెర గ్రామంలో వారం రోజుల పాటు పూజలు అందుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన ఊరేగింపు సందర్భంగా భక్తులు గోవిందా గోవింద నామస్మరణతో గ్రామం మార్మోగింది. గత 33 సంవత్సరాల నుంచి బాలాజీ జెండాకు మండల కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతిచెందిన కాశవ్వ

బిచ్కుంద, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో గోనె కాశవ్వ (60) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. కాశవ్వ అనే మహిళ చనిపోయి ఉందని ఎదురింట్లో ఉన్న భూదెవ్వ పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి బాన్సువాడ డీఎస్పీ, బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో చోరీ



ఆలయ తాళాలు పగులగొట్టిన దృశ్యం

బిచ్కుంద, సెప్టెంబరు 29: మండలకేంద్రంలోని మల్కాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం రాత్రి దొంగతనం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. రోజూ లాగే ఆదివారం ఉదయం ఆలయానికి పూజారి రాగా తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండడంతో కమిటీ సభ్యులకు స మాచారం అందించాడు. వారు పరిశీలించి పోలీసులకు సమాచారం అం దించడంతో ఎస్సై మోహన్‌రెడ్డి అక్కడికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో

ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి మృతి



మృతి చెందిన మారుతి పటేల్

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 29: గుండె పోటుతో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి మృతి చెందిన ఘటన ఒకటి జుక్కల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. జుక్కల్ మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన మారుతి పటేల్ వీఆర్ఏగా పనిచేయగా, గతంలో వీఆర్ఏ పదోన్నతులలో భాగంగా రాజంపేట్ మండలానికి జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే కొన్నాళ్ల కిందట డిప్యూటేషన్‌పై జుక్కల్ ఎంపీడీవో కార్యాలయానికి బదిలీపై వచ్చారు. శనివారం రాత్రి గుండె పోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే మరణించారు. శనివారం సాయంత్రం వరకు తోటి ఉద్యోగులతో కలిసిపని చేసిన మారుతి పటేల్ అకస్మాత్తుగా మృతి చెందడంతో తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మారుతి పటేల్ మృతి పట్ల జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాము వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

రామారెడ్డి, సెప్టెంబరు 29: నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నిర్వహించిన జిల్లాస్థాయి బాలికల ఫుడ్‌బాల్ ఎంపికలో మండలంలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు శివసాహిని, కీర్తనలు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,పీఈటీ చంద్రయ్యలు విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిపోటిలలో మంచి ప్రతిభ కనబరచాలని సూచించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	సరిపోదా శనివారం	మహేశ్వరి	దేవర
దర్శన్	ఏఆర్ఎమ్	వెంకటేశ్వర	సత్యం సుందరం
ప్రియా 35	మత్తు వదలరా-2		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

